క్లుప్తంగా

ప్రత్తిపాడు ఎస్‌హెచ్‌వో–2గా బాలకృష్ణయ్య



ప్రత్తిపాడు: స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో–2గా కె. బాలకృష్ణయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో జరిగిన బదిలీల్లో భాగంగా గుంటూరు సీసీఎస్‌లో పని చేస్తున్న ఆయన్ను ప్రత్తిపాడుకు బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో బాలకృష్ణయ్య బాధ్యతలు చేపట్టారు.

దివ్యాంగుల మహాసభను జయప్రదం చేయండి



ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో బుధవారం సాయంత్రం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల కన్వీనర్ తోడేటి ఏసుపాదం మాదిగ ఆధ్వర్యంలో దివ్యాంగుల గర్జన మహాసభ కరపత్రాల్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు మురికిపూడి హృదయరాజు మాదిగ, మాలమహానాడు, దివ్యాంగుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు కోడిరెక్క కోటిరత్నం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగుల పింఛన్‌ను రూ. ఆరు వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. దివ్యాంగ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో 21 డిమాండ్ల సాధనకు శనివారం నాగార్జున విశ్వ విద్యాలయం ఎదురుగా నిర్వహిస్తున్న మహాగర్జన కార్యక్రమానికి తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు.

పోషకాహారంతోనే బాలికల్లో సమగ్ర ఎదుగుదల

కాకుమాను: కిశోర బాలికలు రోజూ పోషకాహారం తీసుకుంటేనే వయస్సుకు తగ్గ ఎదుగుల ఉంటుందని ఐసీడీఎస్ పాండ్రపాడు సెక్టార్ సూపర్‌వైజర్ వెంకాయమ్మ సూచించారు. అన్నారు. మండలంలోని బీకేపాలెంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలకు బుధవారం పోషకాహారం, వ్యక్తిగత శుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాలికలకు క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



చేబ్రోలు: మహిళలు పురుషులతో పాటు సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి. శ్రీదేవి అన్నారు. కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని గుండవరం, గొడవర్రు గ్రామాల సర్పంచులు చుక్కా సాయి నాగేంద్రమ్మ, బీరం జానకీదేవిలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహనానికి ప్రతి రూపం స్త్రీ అన్నారు. విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని సూచించారు. ఈ సందర్భంగా కళాశాలలో వివిధ కార్యక్రమాల్ని నిర్వహించారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల్ని అందజేశారు. కార్యక్రమంలో అర్థశాస్త్ర అధ్యాపకులు ఏడుకొండలరావు, ఏ. రామకృష్ణారావు పాల్గొన్నారు.

జాబ్ కార్డున్న ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పన

కాకుమాను: కేటాయించిన కొలతల ప్రకారం పనులు చేసి ఉపాధి కూలీలు కనీస వేతనం పొందాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పి.ఉమాదేవి తెలిపారు. మండలంలోని వల్లూరు, లింగంగుంటపాలెం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్ని బుధవారం ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జాబ్ కార్డున్న ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తామని, లేని వారు దరఖాస్తు చేసుకుని పనులకు వెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా పనుల వివరాలను నమోదు చేసేందుకు పలు సాంకేతిక సమస్యలు వస్తున్నాయని సిబ్బంది పీడీ దృష్టికి తీసుకురావడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. అనంతరం కూలీలతో మాట్లాడారు. పని ప్రదేశంలో వసతుల కల్పన, సమస్యల గురించి ఆరా తీశారు. ఆమె వెంట ఏపీడీ బాలమ్మ, ఏపీఓ సింగారావు, సిబ్బంది ఉన్నారు.

సమష్టి కృషితోనే విజయ బావుటా

- ప్రజలకు అండగా నిలిచిన సీఎం వైఎస్. జగన్
- ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి
- ఆత్మీయ సమావేశంలో పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



పార్టీ నాయకులతో పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: వైఎస్సార్ సీపీ విజయానికి పార్టీ, నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం చేబ్రోలు, పెదకాకాని మండలాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఆయన ఆశయాల్ని ఆదర్శంగా తీసుకొని నిరంతరం సేవా కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళుతున్నానని చెప్పారు. నియోజకవర్గంలో గత రెండేళ్లలో ప్రతి ఒక్కరినీ పలకరించానని, నేత్ర, గుండె, ఫిజియోథెరపీ, దివ్యాంగ శిబిరాలతో ప్రజలతో మమేకమయ్యానని తెలిపారు. పార్టీలోని ప్రతి ఒక్కరికీ అన్ని విధాలుగా అండగా ఉంటానని పేర్కొన్నారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన పనుల్ని తెలియజేయాలని కోరారు. ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. సంక్షేమ సారథి సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసే విధంగా అందరూ కృషి చేయాలని మురళీకృష్ణ చెప్పారు. రానున్న ఎన్నికల్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ముందుకుసాగాలని తెలిపారు. అద్దంకి నియోజకవర్గంలోని మేదరమెట్లలో ఈ నెల 10వ తేదీన జరిగే సిద్ధం సభలో నియోజకవర్గం నుంచి వేలాది మంది పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వేజండ్ల సొసైటీ చైర్మన్ చందు సాంబశివరావు, చేబ్రోలు ఎంపీపీ కొక్కిలిగడ్డ సాహితి, పార్టీ ప్రధాన కార్యదర్శి దాసరి శివరామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు బత్తుల అనురాధ, మండలాధ్యక్షుడు చాగంటి మురళీమోహన్‌రెడ్డి, పెదకాకాని జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, జోసఫ్, నంబూరు ఎంపీటీసీ సభ్యుడు లతీఫ్, ఉప్పలపాడు ఎంపీటీసీ సభ్యురాలు డి. శివపార్వతి, నారాకోడూరు ఎంపీటీసీ సభ్యుడు రత్నంరాజు, పక్షుల కేంద్రం చైర్మన్ అనిల్ కుమార్, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ వి. విజయలక్ష్మి, సర్పంచులు, నాయకులు షేక్ నాజర్, పొన్నూరు జెడ్పీటీసీ సభ్యుడు రమేష్, ఎండేటి వెంకట సుబ్బయ్య, జేసీఎస్ పట్టణ కన్వీనర్ అమిరినేని సాంబశివరావు పాల్గొన్నారు.

నడింపాలెం ఇన్‌చార్జి సర్పంచ్‌గా కుమారి



ప్రత్తిపాడు: నడింపాలెం ఇన్‌చార్జి సర్పంచ్‌గా ఉప సర్పంచ్ పాలెపు కుమారి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత సర్పంచ్ లాం రత్నకుమార్ అనారోగ్య కారణాలతో ఆరు నెలలు సెలవు పెట్టారు. దీంతో ఉప సర్పంచ్ కుమారికి ఇన్‌చార్జి సర్పంచ్‌గా బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా పంచాయతీ అధికారి కె. శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం సర్పంచ్ కుమారి పార్టీ నాయకులు, గ్రామస్తుల సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి ఖాజాతో పాటు వార్డుసభ్యులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఆమెకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ ఆళ్ల వీరాస్వామి, సొసైటీ మాజీ అధ్యక్షులు కట్టా సుబ్బారావు, గింజుపల్లి సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యులు వి. మాణిక్యరావు, పూర్ణి వెంకటేశ్వరరావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు కన్నా అక్కిరాజు, నాయకులు షేక్ దరియావలి, వాసిమళ్ల అమృతయ్య, కొండపాటూరి నాగార్జున, దాసరి నాగార్జున, పాలెపు శ్రీను పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభకు పురస్కారం



అవార్డును అందుకున్న విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: సమాజ శ్రేయస్సుకు దోహదపడే నూతన ఆవిష్కరణల్లో తమ కళాశాల విద్యార్థుల నైపుణ్యానికి పురస్కారం లభించడం గర్వకారణమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్ తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటీవల చెన్నైలోని అన్నా యూనివర్సిటీలో కురుక్షేత్ర– 2024 పేరుతో నిర్వహించిన టెక్నోవేషన్ ఇంటర్ కాలేజీ ప్రాజెక్ట్ కాంపిటీషన్‌లో తమ కళాశాల విద్యార్థులు జి. భరణివిష్ణు, బి. త్రినాథ్, బి. శ్రీనివాసులు, బి.వై. వినూత్న, శ్రీవైష్ణవి, కె.వి.ఎస్. సాయికల్యాణి, వి. శ్రీవల్లి జట్టు తయారు చేసిన కృత్రిమ చేయి అవయవ నూతన ఆవిష్కరణ ప్రదర్శన తృతీయ స్థానం పొంది అవార్డును, నగదు పురస్కారాన్ని అందుకున్నారని తెలిపారు. విద్యార్థుల్ని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎస్.వి.శ్రీనివాసరావు, కె. కార్తిక పవన్, నాగమల్లేశ్వరరావు, ఎం.వి.పి.చంద్రశేఖర్ అభినందించారు.

ఫెర్టిలైజర్ షాపులపై విజిలెన్స్ దాడులు



షాపులో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

పొన్నూరు: నిడుబ్రోలులోని ఫెర్టిలైజర్, పెస్టిసైడ్ షాపుల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ శాఖ నుంచి అనుమతులు లేకుండా, రికార్డ్స్‌లో రాయకుండా ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ విక్రయిస్తున్నారని రైతుల నుంచి వచ్చిన సమాచారంతో అధికారులు తనిఖీలు చేశారు. గుంటూరు రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు ఎస్పీ పర్యవేక్షణలో రెండు ఫెర్టిలైజర్, పెస్టిసైడ్స్ షాపులో ఫైల్స్ తనిఖీ చేశారు. రెండు కంపెనీలకు చెందిన ఎరువుల స్టాక్‌లు లైసెన్స్‌లో నమోదు చేయలేదని గ్రహించారు. దీంతో షాపులోని రూ. 89వేల విలువైన ఫర్టిలైజర్ అమ్మకాలను నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ వ్యవసాయ అధికారి కె. రమణ కుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.రామచంద్రయ్య సిబ్బంది తదితనేలే పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలపై ముందస్తు జాగ్రత్త అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఇంటూరి పద్మావతి

గుంటూరు రూరల్: వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మండల పరిషత్ అధ్యక్షురాలు ఇంటూరి పద్మావతి సూచించారు. నగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం రూరల్ మండలం సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గ్రామాల్లో డిపార్ట్‌మెంట్ల వారీగా చేపడుతున్న అభివృద్ధి పనులతో పాటు కార్యక్రమాల్ని అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, పనుల్ని త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. రానున్న వేసవిలో చేపట్టాల్సిన కార్యాచరణ, అజెండాను తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆదినారాయణ, తహసీల్దారు రవీంద్రరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిళ్లు దగ్ధం

- నిరాశ్రయులైన తొమ్మిది కుటుంబాలు
- బాధితులకు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పరామర్శ
- ఆర్థిక సహాయం అందజేత



పిల్లలను హత్తుకున్న సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: పట్టణంలోని 19వ వార్డు ఎస్టీ కాలనీలో మంగళవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్‌తో ఏడు పూరిళ్లు దగ్ధమయ్యాయి. వాటిలో నివాసం ఉంటున్న తొమ్మిది కుటుంబాలకు చెందిన వారు నిరాశ్రయులయ్యారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి ఒంటిగంట సమయంలో ఒక ఇంటిలోని విద్యుత్ తీగల్లో షార్ట్ సర్క్యూట్ ఏర్పడడంతో మంటలు వ్యాపించి గ్యాస్ సిలిండర్‌పై పడ్డాయి. అది పగలడంతో మంటలు చెలరేగి పక్కనున్న ఏడు పూరిళ్లకు వ్యాపించడంతో అగ్నికి ఆహుతయ్యాయి. నివాసం ఉంటున్న తొమ్మిది కుటుంబాల వారు బయటికి పరుగులు తీయడంతో ప్రమాదం తప్పింది. అగ్నిమాపక వాహనం వచ్చినప్పటికీ ఫలితం దక్కలేదు. ఇళ్లలోని సామగ్రిని తీసుకునే సమయం కూడా లేకపోవడంతో వస్త్రాలు, 40 వేల రూపాయల విలువ చేసే బంగారపు వస్తువులు, వెండి పట్టీలు అగ్నిలో కాలిపోయాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

బాధితులకు ఆర్థిక సాయం

అగ్నిప్రమాదం సమాచారం తెలుసుకున్న వైఎస్ఆర్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తక్షణ సహాయంగా ఒక్కో కుటుంబానికి రూ. 5వేలు ఆర్థిక సహాయం చేశారు. ముస్లిం నాయకులు షేక్ నాజర్, జేసీఎస్ పట్టణ కన్వీనర్ అమిరినేని సాంబశివరావు పాల్గొన్నారు. తహసీల్దార్ నారాయణ సింగ్, పట్టణ సీఐ పి. భాస్కర్ బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు.

- ట్రైకార్(ఆంధ్ర ప్రదేశ్ షెడ్యూల్ తెగల సహకార ఆర్థిక సంస్థ) చైర్మన్ గుండా సురేంద్ర, జిల్లా అధికారి శిరీష అగ్ని ప్రమాద స్థలాన్ని పరిశీలించి బాధిత కుటుంబాల్ని పరామర్శించారు.

రాష్ట్రంలో స్పష్టంగా పారిశ్రామిక ప్రగతి

ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ సీఈవో రామకోటిరెడ్డి



ప్రత్తిపాడు: రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి స్పష్టంగా కనిపిస్తోందని ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ (ఏపీఐటీఏ) సీఈవో డాక్టర్ డి.వి. రామకోటిరెడ్డి అన్నారు. ప్రత్తిపాడు మండలం ఈదులపాలెం గుంటూరు ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఏపీఐటీఏ ఆధ్వర్యంలో వాయిస్ ఆఫ్ ఏపీ–ఐటీ, ఐటీ ఇండస్ట్రీలో ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీఐటీఏ సీఈవో రామకోటిరెడ్డి హాజరయ్యారు. ఐటీ రంగంలో ఉద్యోగావకాశాలు పొందాలంటే ఉండాల్సిన నైపుణ్యాలు, తీసుకోవలసిన శిక్షణలపై సమగ్రంగా వివరించారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఉద్యోగాలు సాధించాలంటే ఇంజినీరింగ్ విద్యతో పాటు నూతన కోర్సులను కూడా నేర్చుకోవాలని ఆయన సూచించారు.

ప్రభుత్వ ప్రోత్సాహంతో పరిశ్రమలు

ప్రభుత్వ ప్రోత్సాహం, సహకారంతో అనేక కొత్త పరిశ్రమలు ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటవుతున్నాయని డాక్టర్ రామకోటిరెడ్డి అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు, విద్యారంగంలో చేస్తున్న విప్లవాత్మక మార్పులు ఉద్యోగాల కల్పనతో పాటు ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తున్నాయని వివరించారు. రాష్ట్రంలో పారిశ్రామిక రంగానికి ప్రభుత్వం ఊతమందిస్తుండటంతో నూతన పరిశ్రమలు పెరుగుతున్నాయని, నిరుద్యోగం వంటి సమస్యలు తగ్గుముఖం పడుతున్నాయని రామకోటిరెడ్డి తెలిపారు. వృత్తి నైపుణ్య శిక్షణలతో ఎంతో మంది నిరుద్యోగ యువత మంచి ఉద్యోగాలు పొందుతున్నారని ఆయన పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల సందేహాల్ని నివృత్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ రోశిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఓ. రామకోటయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహా శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం



పెళ్లి కుమారుని అలంకారంలో స్వామి

చేబ్రోలు: స్థానిక ప్రసిద్ధ గంగా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ప్రదోష కాలంలో స్వామి పెండ్లి కుమారుని అలంకారంలో దర్శనమిచ్చారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సిద్ధం సభను జయప్రదం చేద్దాం

- ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్
- జగనన్నను మరలా ముఖ్యమంత్రిని చేద్దాం

గుంటూరు రూరల్: సిద్ధం సభను జయప్రదం చేద్దాం ...జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేస్తుందామని ప్రత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఏటుకూరులోని కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమన్వయకర్త మాట్లాడుతూ దేశంలో ఎన్నడూ లేని వి. ధంగా ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా జగనన్న పాలన చేశారని తెలిపారు. దేశం మొత్తం రాష్ట్రం వైపు చూసే విధంగా ఆయన సాగినట్లు చెప్పారు. మరలా జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు మనమంతా సైనికుల్లా సిద్ధమవ్వాలని సూచించారు. సమష్టిగా కృషిచేసి జగనన్నకు అండగ నిలిచి, వైఎస్సార్ సీపీ సత్తాను దేశం నలుమూలలా వినిపించేలా పని చేద్దామని పిలుపు నిచ్చారు. ఈనెల 10న జరిగే సిద్ధం మహాసభకు నియోజకవర్గం నుంచి లక్షల్లో తరలి వెళ్లేందుకు సమాయత్తం కావాలని చెప్పారు.

విద్యే అభివృద్ధికి మార్గం

విద్యే మనిషి అభివృద్ధికి మార్గమని, విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెచ్చి ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు ఏమి తీసిపోవని రుజువు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయర్త బలసాని కిరణ్ కుమార్ తెలిపారు. మండలంలోని జొన్నలగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 10వ తరగతి విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లక్ష్య సాధన కోసం ప్రతి విద్యార్థి నిరంతరం కృషి చేయాలని చెప్పారు. చదువుకున్న పాఠశాలతో పాటు విద్యా వ్యవస్థలో మార్పులు తెచ్చి, ప్రతి విద్యార్థి ఉన్నతికి కృషి చేస్తున్న జగనన్నకు మంచి పేరు ప్రఖ్యాతులు తేవాలని సూచించారు. కార్యక్రమంలో మండలంలోని ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త బలసాని

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణే లక్ష్యం

ట్రైనీ డీఎస్పీ గీత



సిబ్బందితో కవాతు నిర్వహిస్తున్న ట్రైనీ డీఎస్పీ

కాకుమాను: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్ని ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా మండల ప్రజలంతా సహకరించాలని ట్రైనీ డీఎస్పీ గీత కోరారు. మండలంలో సమస్యాత్మక గ్రామాలైన కాకుమాను, చినలింగాయపాలెం, కొల్లిమర్ల గ్రామాలలో బుధవారం పోలీసులు, సీఐఎస్ఎఫ్, ఆర్మ్‌డ్ ఫోర్స్‌లతో కవాతు నిర్వహించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యమని ఆమె తెలిపారు.ఎన్నికల సమయంలో గ్రామాల్లో అల్లర్లు, ప్రజల్ని ఇబ్బంది కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు సీఐ నిషార్ బాషా, కాకుమాను ఎస్ఐ రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

పొన్నూరులో..

ఎన్నికల నిర్వహణలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పట్టణంలో బుధవారం సీఐ పి. భాస్కర్ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు కేంద్ర పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్, ఎస్‌పీపీ రోడ్డు, ఇటికంపాడు రోడ్డు వరకు మార్చ్ ఫాస్ట్ చేశారు. ఈ సందర్భంగా సీఐ భాస్కర్ మాట్లాడుతూ ఎన్నికలపై ప్రజలకు భరోసా, భద్రత కల్పించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసు కవాతు నిర్వహించినట్లు తెలిపారు.

నిబంధనలకు అనుగుణంగా పటిష్ట ఏర్పాట్లు

ప్రత్తిపాడు: నామినేషన్ల సమయంలో నిబంధనలకు అనుగుణంగా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని ప్రత్తిపాడు సీఐ, నోడల్ ఆఫీసర్ నిసార్‌బాషా అన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ సమయం దగ్గర పడుతుండటంతో అధికారులు ఏర్పాట్లలో తలమునకలవుతున్నారు. ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలోనే నామినేషన్ల ప్రక్రియ జరగనుండటంతో.. అక్కడ చేయవలసిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం మధ్యాహ్నం ట్రైనీ డీఎస్పీ గీతా, సీఐ నిసార్ బాషా, తహసీల్దార్ జి. రాఘవేంద్రరావులు సమాలోచనలు చేశారు. బారికేడ్లు ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలి? ట్రాఫిక్ నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి? ఐదుగురు వ్యక్తులు మినహా మిగిలిన వారిని ఎక్కడి వరకు నియంత్రించాలి.. వంటి పలు విషయాలను చర్చించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం శాంతిభద్రతలకు భంగం కలగకుండా, నిబంధనలు ఉల్లంఘించకుండా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి చర్యలు తీసుకుంటున్నామో ప్రతిపాదించి, ఆర్‌వోకు పంపి అప్రూవల్ తీసుకోవాల్సి ఉంటుందని వివరించారు. నిసార్ బాషా మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ అంతా సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



చేబ్రోలు: మండలంలోని కొత్తరెడ్డిపాలెం కేసీ హైస్కూలులోని పదో తరగతి విద్యార్థులకు సీహెచ్. సాంబయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. రైటింగ్ ప్యాడ్, పెన్స్, పెన్సిల్స్, జామెంటరీ బాక్స్ తదితర సామగ్రి కిట్‌ను ట్రస్టు అధ్యక్షుడు సీహెచ్. భాస్కరరావు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గాదె వెంకట సుబ్బారెడ్డి, హెచ్ఎం మోహనరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, చల్లా శంకరరెడ్డి, సుజాత పాల్గొన్నారు.